"ఎవరివి ఇవి? వెంటనే వీటిని తుడిచి శుభ్రం చెయ్యి."

"మనమెంత ధనవంతులమో మర్చిపోకూడదని కావాలనే వాటినలా వుంచానండి." చెప్పింది శైలజ.

## 43. మూర్ఖుడి పని

ఒక ఊళ్ళో ఓ పేరుమోసిన రౌడి ఉన్నాడు. అతను దుకాణదారులని, ధనవంతులని బెదిరించి ధనార్జన చేయసాగాడు. ప్రాణభయంతో ఎవరూ అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి ముందుకి రాలేదు. ఎందుకంటే అతను హంతకుడు కూడా. దాంతో చట్టం అతన్ని ఏం చెయ్యలేకపోయింది. పోలీసులు కూడా నిస్సహాయులై పోయారు.

ఈ పరిస్థితుల్లో ఆ ఊరికి ఓ సద్గురువు వచ్చాడు. ఆయన తనతో తెచ్చుకున్న బంగారు పెట్టెలో ఆయన నిత్యం పూజించే దేవతా విగ్రహాలున్నాయి. అవి వజ్రాలు పొదిగినవి.

ఆ సద్గురువు విలువైన బంగారు విగ్రహాలతో తమ వూరు వచ్చిన సంగతి ఆ రౌడీ చెవులబడింది. వాటి మీద అతనికి ఆశ కలగడంతో వాటిని ఎలాగైనా చేజిక్కించుకోవాలని అనుకున్నాడు.

ఓరోజు కత్తి పట్టుకుని సరాసరి రౌడి ఆ సద్గురువు బస చేసిన నివాసానికి వెళ్ళాడు. బంగారు పెట్టెలోని విగ్రహాలు ఇవ్వమని లేదా చంపేస్తానని ఆయన్ని బెదిరించాడు.

ఆయన ఏ మాత్రం భయపడకుండా చిరునవ్వుతో చెప్పాడు.

"నువు కోరినట్లుగానే ఇస్తాను. కాని ముందు నా ప్రశ్నలకి జవాబు చెప్పు చాలు."

"అలాగే. అవేమిటో తొందరగా అడుగు." అయిష్టంగా ఒప్పుకున్నాడు రౌడి.

"నువ్వు ఓ విదేశానికి వెళ్ళే అవకాశం వచ్చిందనుకో. అక్కడ నువ్వు ఓ ఏడాది పాటు వుండి ఓ కోటి రూపాయలు సంపాదించే అవకాశం కూడా కలిగి, కోటి సంపాదించావనుకో. ఏడాది తర్వాత నీ వీసా సమయమైపోయి నువ్వు తిరిగి ఇండియాకి రావాల్సివుంది. నువు సంపాయించిన దాంట్లోంచి నయా పైసా కూడా బయటికి తీసుకెళ్ళకూడదన్న నియమం ఉంది. అప్పుడు నువ్వు ఏడాది పాటు కష్టపడి సంపాదిస్తావా లేక ఖాళీగా వుంటావా?"

"తీసుకెళ్ళడం సాధ్యంకాని దేశంలో సంపాదించి ప్రయోజనం ఏముంది? ఎంత సంపాదించినా అదంతా అక్కడ వదిలి రావాల్సిందేగా! మూర్ఖుడైనవాడు తప్ప తెలివైనవాడెవడూ అలాంటప్పుడు ఏం సంపాదించడు."

"నువ్వు మూర్ఖుడివి కావని ఎందుకనుకుంటున్నావు?" నవ్వుతూ ప్రశ్నించాడు సద్గురువు.

"నేను మూర్ఖుడినని అసలు మీకెందుకు అనిపిస్తోంది?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడా రౌడి.

"నాయనా. నువ్వు చెప్పేదొకటి. చేసేది మరొకటి. అందుకని ఆ అనుమానం వచ్చింది." చెప్పాడు సద్గురువు.

"మీ మాటలు నాకు ఎంతమాత్రం అర్థం కావడంలేదు."

"ఈ భూమి కూడా ఆ దేశంలాంటిదే. ఇక్కడ సంపాదించింది ఏదీ మనవెంట తీసుకు వెళ్ళలేం. అయినా ఈ సంగతి తెలీక నువ్వు, ఇంకా నీలాంటి అనేకులు, జానెడు పొట్ట నింపుకోడానికి సరిపడే దానికన్నా ఎక్కువ, నానా అగచాట్లు పడి సంపాదిస్తున్నారు. ఆ ప్రయత్నంలో మనల్ని స్వర్గానికి తీసుకెళ్ళే పుణ్యాన్ని కాక, నరకానికి చేర్చే పాపాన్ని ఆర్జించడం మూర్ఖుడు చేసే పని కాక మరేమిటి? నువ్వే చెప్పు. ఈ బంగారు విగ్రహాలు దొంగిలించే

పాపాన్ని నేను నీకెందుకివ్వాలి? ఇవిగో. వీటిని నా అంతట నేనే ఇస్తున్నాను. పట్టుకెళ్ళు."

ఆయన ఆ బంగారు పెట్టెని ఆ రౌడి చేతిలో పెట్టాడు. రౌడి ఆ పెట్టెని తీసుకోలేదు.

"మీ బోధ నా తలకెక్కింది. నేనింక ఎలాంటి పాపం చేయను." ఆ సద్గురువుతో స్థిరంగా చెప్పాడా రౌడి.

## 44.(అ) శాంతి

అర్ధరాత్రి అయినా నిద్ర పట్టని ఓ ధనవంతుడు తన ఇంటి డాబా మీదకి వెళ్ళి నక్షత్రాలని, చంద్రుడిని చూస్తూండగా,ఆయన దృష్టి పక్కనున్న స్థలంలోని పాక మీద పడింది. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న ఓ రోజు కూలి ఆ పాకలో గుర్రుపెట్టి నిద్రపోతూ కనిపించాడు.

చింకిచాప మీద, తలకింద చేతిని వుంచుకుని పడుకున్న అతను రేపెలా గడుస్తుందన్న ఆలోచన లేక హాయిగా, నిశ్చింతగా ఎలా నిద్ర పోగలుగుతున్నాడు? ఆ సంగతి మర్నాడు ఆయన తన ఆధ్యాతిక గురువుకి చెప్పాడు.

తన శిష్యుడికి మంచి ఆధ్యాత్మిక పాఠం చెప్పడానికి అది చక్కటి అవకాశంగా భావించిన ఆ గురువు చెప్పాడు.

"నీ ప్రశ్నకి సరైన సమాధానం చెప్తా కాని, నువ్వు అతనికి ఓ బస్తా బియ్యం, ఇతర వంట సామగ్రి కోసం ఓ వెయ్యి రూపాయలు వెంటనే పంపు. ఈ రాత్రికి ఏమవుతుందో చూడు."

ఆ ప్రకారం ధనవంతుడు వెంటనే వాటిని ఆ పేదవాడి ఇంటికి పంపాడు. ఆ రాత్రి కూడా నిద్రపట్టని ఆ ధనవంతుడు తన ఇంటి డాబా మీద పచార్లు చేస్తూంటే, పాకలోని పేదవాడు కూడా నిద్ర పట్టక పక్కమీద దొర్లుతూ కనిపించాడు.